సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 29 । జూలై । 2025



వైభవంగా తిరునక్షత్ర వేడుకలు

జంగారెడ్డిగూడెం: పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



3న నర్తనబాల అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అభినయ నృత్య భారతి ఆధ్వర్యంలో ఆగస్ట్ 3న వైఎంహెచ్ఏ హాలులో నర్తనబాల అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



కనుల పండువగా గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీవారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆండాళ్ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుక నిర్వహించారు.

న్యూస్‌రీల్

మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి, అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జులై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సంయుక్తంగా ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 30 వరకు పిల్లల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జిల్లాలో పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి నడవడికపై పర్యవేక్షణ చేపట్టాలన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి అత్యవసర సమయాల్లో 1098, 1800 1027 222 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డీపీఓ ఎ.రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి హెచ్చరించారు. కలెక్టరేట్ డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో సోమవారం లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం అమలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



భీమవరంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదులకు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. 14 ఫిర్యాదులు అందగా బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆర్‌జేసీ విచారణ



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌జేసీ త్రినాథరావు

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సమస్యలపై ఫిర్యాదుల నేపథ్యంలో దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథరావు సోమవారం విచారణ నిర్వహించారు. మూలవిరాట్‌కు దాతల సహకారంతో చేయించిన వెండి మండపంపై మరో దాత ఇచ్చిన ఆరు గ్రాముల బంగారు పతకం ఎలా పెడతారని ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు ప్రశ్నించారు. ఆలయ ప్రధానార్చకులు ముగ్గురూ ప్రతి ఉపాలయం వద్ద సొంతంగా కొందరు బ్రాహ్మణులను పెట్టుకుని పళ్లాలను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఆలయంలో పళ్లాల సంస్కృతి తొలగించాలని సూచించారు. స్వామివారి కల్యాణం లోపల మండపంలో కాకుండా బయట ఏర్పాటుచేయడం వల్ల భక్తులు తిలకించడానికి వీలుగా ఉంటుందని ఆ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

బడికి మూత

- సర్కారు స్కూళ్లకు 'మోడల్' కష్టాలు
- జిల్లాలో ఫౌండేషన్ పాఠశాలలు 186
- ఒక్కో పాఠశాలలో ఒకరి నుంచి ఐదుగురు మాత్రమే విద్యార్థులు
- ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆరోజు పాఠశాల మూతే
- కూటమి విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య



వెలగలవారిపాలెంలోని ఎంపీపీ స్కూల్

సాక్షి, భీమవరం: విద్యావ్యవస్థలో కూటమి ఎంపీఎస్ (మోడల్ ప్రైమరీ స్కూల్) విధానం ప్రభుత్వ పాఠశాలలకు ముప్పుగా తయారైంది. ఎంతో చరిత్ర కలిగిన పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడే ప్రమాదం పొంచి ఉంది. గత విద్యాసంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 1,400 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1, 2 తరగతులు కలిగిన ఫౌండేషన్ స్కూళ్లు (ఎఫ్ఎస్) 96 ఉండగా, 1 నుంచి 5 వరకు ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్లు (ఎఫ్‌పీఎస్) 1025, 1 నుంచి 7/8వ తరగతి వరకు ప్రైమరీ హైస్కూళ్లు (పీహెచ్ఎస్) 43, 3 నుంచి 10 వరకు హైస్కూళ్లు(హెచ్ఎస్) 43, 6 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు (హెచ్ఎస్)144, జూనియర్ ఇంటర్ కలిగిన హైస్కూళ్లు (హెచ్ఎస్ ప్లస్) 20 ఉన్నాయి.

తగ్గిన విద్యార్థుల సంఖ్య

ఎంపీఎస్ విధానంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత విద్యాసంవత్సరంలో 1,04,654 మంది ఉండగా, ఈ విద్యాసంవత్సరంలో 87,861 మంది ఉన్నారు. ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయని వీరి సంఖ్య పెరగవచ్చునని విద్యాశాఖ వర్గాలంటున్నాయి. పాఠశాలల విలీనం నేపథ్యంలో భవిష్యత్తులో తక్కువ విద్యార్థులు ఉన్న వాటిని ప్రభుత్వం ఎత్తివేస్తుందన్న అనుమానంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడం తగ్గుదలకు కారణంగా తెలుస్తోంది.

నాడు.. నాడు–నేడుతో మహర్దశ

పేదల విద్యకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ప్రపంచంతో పేదల పిల్లలు పోటీపడేలా ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. మనబడి నాడు–నేడుతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఊపిరిలూదారు. రూ. 369.11 కోట్ల వ్యయంతో డిజిటల్ క్లాస్‌రూంలు, తాగునీటి వసతి, టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుదీకరణ, మేజర్, మైనర్ మరమ్మత్తులు తదితర అభివృద్ధి పనులు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు కొమ్ము కాస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ఎత్తుగడలు వేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపీఎస్‌తో పొంచి ఉన్న ముప్పు

ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపీఎస్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో 60 మంది విద్యార్థులు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చోట సమీప ఎఫ్‌పీఎస్ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను వీటిలో విలీనం చేశారు. మిగిలిన 1, 2 తరగతులతో ఎఫ్‌పీఎస్ పాఠశాలలు కాస్తా ఫౌండేషన్ స్కూళ్లుగా మారిపోయాయి. ఈ మేరకు ప్రస్తుతం జిల్లాలో 186 ఫౌండేషన్ స్కూళ్లు ఉండగా బేసిక్ ప్రైమరీ 730, మోడల్ ప్రైమరీ స్కూళ్లు 244, యూపీ 35, హైస్కూళ్లు 197 ఉన్నాయి. ఫౌండేషన్ స్కూళ్లు ఏకోపాధ్యాయ, బేసిక్ ప్రైమరీలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటున్నారు. గతంలో 96 మాత్రమే ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలు ప్రస్తుతం 186కు పెరిగాయి. వ్యక్తిగత, అత్యవసర పనిపై వీటిలోని ఉపాధ్యాయులు సెలవు పెట్టాల్సి వస్తే కొన్నిచోట్ల డిప్యుటేషన్ మరొకరిని నియమిస్తున్నారు. అందుబాటులో లేని చోట ఆ రోజుకు ఆ ఫౌండేషన్ స్కూల్‌ను మూసివేసి అక్కడి విద్యార్థులను సమీప పాఠశాలకు తరలిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.



పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంలోని ఈ ఎంపీపీ స్కూల్‌కు ఎనిమిది దశాబ్దాల చరిత్ర ఉంది. గ్రామానికి చెందిన ఎంతోమంది విద్యావేత్తలు, ఉద్యోగులు, ప్రముఖులు ఓనమాలు దిద్దింది ఇక్కడే. తాజాగా కూటమి ప్రభుత్వం తెచ్చిన మోడల్ ప్రైమరీ స్కూల్స్ (ఎంపీఎస్) విధానంలో ఇక్కడి 3, 4, 5 తరగతులను ఇందిరమ్మ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో విలీనం చేశారు. ఈ పాఠశాలను 1–2 తరగతులతో ఫౌండేషన్ స్కూల్‌గా మార్చారు. ప్రస్తుతం ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. సోమవారం స్కూల్ ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో ఇక్కడి విద్యార్థులను ఇందిరమ్మ కాలనీలోని స్కూల్‌కు తరలించారు. దీంతో ఇదిగో.. ఎంతో చరిత్ర ఉన్న ఈ పాఠశాలలోని కుర్చీలు ఇలా ఖాళీగా కనిపించాయి.

ప్రభుత్వ తీరు సరికాదు



కూటమి ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ విద్యారంగానికి కొమ్ము కాసేలా ఉన్నాయి. ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించుకునే దిశగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– బొంతు ఆనందరాజు, రిటైర్డ్ హెచ్ఎం, లక్ష్మణేశ్వరం

సూపర్ సిక్స్.. అంతా ఫ్లాప్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శలు

జంగారెడ్డిగూడెం: కూటమి ఏడాది పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా లేరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో గెలవడానికి సూపర్ సిక్స్ ప్రకటించారని, అది ఫెయిల్ అయిందన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారని, ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. హామీలు ఇచ్చే ముందు వారికి తెలియదా? అని ప్రశ్నించారు. ఉచిత బస్సు అని ఊరించి ఇప్పుడు జిల్లాకే పరిమితం అంటున్నారని విమర్శించారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

ఎర్రకాలువ మిగులు భూములను పేదలకు పంచాలని చెప్పారు. ఎర్రకాలువ రిజర్వాయర్ కోసం 3 వేల ఎకరాలు సేకరించారని, దీని కోసం సంబంధిత రైతులకు ప్రభుత్వం పరిహారం కూడా చెల్లించిందని గుర్తుచేశారు. సదరు భూములను భూస్వాములు ఆక్రమించుకొని, లీజులకు ఇచ్చుకొని ఆదాయం పొందుతున్నారని చెప్పారు. అదే పేదలు సాగులోకి వెళ్తే అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. టి.నరసాపురంలో పేదల మీద కేసులు పెట్టి నోటీసులు జారీ చేశారని చెప్పారు. గత మూడు నెలలుగా పీ4 అని అంటున్నారని 20 లక్షల మందిలో 50 వేల మందిని కూడా తీసుకునేందుకు ముందుకు రాలేదని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు టీచర్లు, సచివాలయ ఉద్యోగులు, ఎంప్లాయిస్ మీద పడ్డారని ఎద్దేవా చేశారు. వారికే జీతభత్యాలు లేక, పీఆర్‌సీలు లేక వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తుంటే వారిని బలి చేస్తారా అని ప్రశ్నించారు.

పీ4 ఒత్తిడి తగ్గించకుంటే పోరుబాటే

భీమవరం: ఉపాధ్యాయులు పీ4 పేరుతో కొన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని దాని కోసం వెంటనే రిజిస్టర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిస్తూ ఒత్తిడి చేయడాన్ని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీఎస్ విజయరామరాజు, ఎకేవీ రామభద్రం తీవ్రంగా ఖండించారు. సోమవారం భీమవరంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇప్పటికే బోధనేతర పనులతో బోధనకు దూరం చేయడం వల్ల విద్యార్థుల్లో అభ్యసనం మందగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బదిలీలు, ప్రమోషన్లు తరువాత ఎక్కువ శాతం ఉపాధ్యాయులకు జీతాలు అందక ఆందోళనకు గురవుతున్నారన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్నారైల ఆసరా కోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందన్నారు. విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులపై భారాన్ని తగ్గించాలని, లేకుంటే ఆందోళన బాట పట్టాల్సివస్తుందని హెచ్చరించారు.



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న విజయరామరాజు, రామభద్రం

ఉద్యోగులపై పీ4 భారం దారుణం

ఉద్యోగులపై పీ4 భారాన్ని నెట్టే ఆలోచనను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీ4 పథకానికి కార్పొరేట్లు, సంపన్నుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఆ భారాన్ని ఉద్యోగులపై నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఉపాధ్యాయులంతా ఐదుగురిని దత్తత తీసుకోవాలని విద్యాశాఖాధికారుల ద్వారా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం, మరోవైపు ప్రతి సచివాలయ కార్యదర్శి తప్పనిసరిగా ఇద్దరిని దత్తత తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వకుండా వారి హక్కులను హరిస్తూ భారాలు మోపుతూ పీ4 భారాన్ని నెట్టడం దుర్మార్గమని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు ఎగ్గొట్టిన పన్నులు, బ్యాంకు రుణాలను ప్రభుత్వం వసూలు చేస్తే 20 లక్షల మంది పేదలకు అవసరమైన అన్ని సౌకర్యాలు సులభంగా ఏర్పాటు చేయవచ్చని చెప్పారు.

పారదర్శకంగా అర్జీలు పరిష్కరించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం పారదర్శకత, నాణ్యతతో ఉండాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లా అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలు తమ పరిధిలోకి రాకపోతే వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలు

తల్లికి వందనం ఆర్థిక సాయం అందలేదని అత్తిలికి చెందిన వమ్మి వీర సంధ్య, అల్తి విజయదుర్గ మహేశ్వరి ఫిర్యాదుచేశారు. కంటి చూపు దెబ్బతిందని, పెన్షన్ ఇప్పించాలని కాళ్ల మండలం కోళ్లపర్రు గ్రామానికి చెందిన గండి వెంకన్న అర్జీ పెట్టుకున్నాడు. 22(ఎ) నుంచి తన భూమి తొలగించాలని తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామానికి చెందిన సీహెచ్.సుబ్బలక్ష్మీ, సీహెచ్.బాబురావు, బి.నీరజ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. గొల్లలకోడేరులో పంచాయతీ భూములను అమ్మేస్తున్నారని, సర్పంచ్, ఉప సర్పంచ్ పంచాయతీకి చెందిన స్థలాలను ఆక్రమించుకుని అమ్ముకుంటారని పాలకోడేరు జెడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీతులసి దంపతులు ఫిర్యాదు చేశారు. – పింఛన్ మంజూరు చేయాలంటూ పోడూరు మండలం పెమ్మరాజు పోలవరానికి చెందిన టి.బసవమ్మ అర్జీ అందజేసింది.



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

విద్యా సంస్కరణలు అమలు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ సంస్కరణలు అమలు చేయాలని బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే యోహాన్ ఆదేశించారు. స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో సోమవారం జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్స్‌పాల్స్‌కు ఈ అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ గ్రూప్ విద్యార్థులు అదనంగా వేరో సబ్జెక్టు కూడా చదివి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. సెకండ్ లాంగ్వేజ్ స్థానంలో విద్యార్థులు వారికి నచ్చిన సబ్జెక్టు ఎంచుకుని పరీక్షలు రాయవచ్చన్నారు.

బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు(టూటౌన్): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ సోమవారం ధర్నా నిర్వహించింది. ఈ ధర్నానుఉద్దేశించి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచి రావాల్సిన క్లైములు చెల్లించకపోవడం వల్ల వేలకొద్దీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించి, అదనంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు తన సొంత నిధుల నుంచి కోటి రూపాయలు జమ చేస్తానని కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఆందోళనతో వెనక్కి తగ్గిన డీఈవో


PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, ELURU DISTRICT, ELURU

పీ4 మార్గదర్శకులుగా రిజిస్టర్ చేయించాలని డీఈఓ ఉత్తర్వులు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ప్రతి మండలంలో 190 మంది ప్రధానోపాధ్యాయులు/స్కూల్ అసిస్టెంట్లను పీ–4 మార్గదర్శకులుగా తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు ఇచ్చిన మరుసటి రోజు సాయంత్రం 5 గంటల లోపు ప్రతి మండలంలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ విషయంపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో డీఈఓ తన ఉత్తర్వులపై యూటర్న్ తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉపాధ్యాయులెవరినీ కూడా పీ4లో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఎలాంటి ఒత్తిడి చేయలేదని తెలిపారు. మార్గదర్శిగా నమోదు స్వచ్ఛంద కార్యక్రమమని ఆ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధులను అప్పగించే విషయంలో జిల్లా కలెక్టర్ కూడా వ్యతిరేకమన్నారు. డీఈఓ యూటర్న్ తీసుకోవడంతో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమించుకున్నారు.

సుప్రీం ఆదేశాలూ లెక్కచేయక..

- రెడ్‌బుక్ వేధింపుల్లో పోలీసులదే కీలకపాత్ర
- సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్న వైనం
- పెదవేగి ఎస్సైకు మెమో జారీ చేసిన న్యాయమూర్తి
- గతంలో భీమడోలు పోలీసులు కూడా ఇదే తరహా అత్యుత్సాహం
- జిల్లాలో పెరుగుతున్న రెడ్‌బుక్ వేధింపులు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికార పార్టీ నాయకుడు చెబితే అడ్డగోలుగా రెచ్చిపోతున్నారు. కనీసం ఫిర్యాదు ఉందా.. దానిపై విచారణ చేశామా.. చేస్తుంది న్యాయమా, అన్యాయమా ఇలాంటి సహజ న్యాయసూత్రాలను విస్మరించి అధికార పార్టీ నేతలు చెబితే అడ్డగోలుగా అక్రమ నిర్బంధాలు, రకరకాల కేసుల పేరుతో వేధింపులకు జిల్లా పోలీస్ యంత్రాంగం తెరతీసింది. జిల్లా పరిధిలో కొన్ని పోలీస్ స్టేషన్లలో ఈ తరహా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కొందరు ఎస్సైలు ప్రజాప్రతినిధుల మెప్పు కోసం అమలు చేస్తూ తలనొప్పులు తెచ్చుకుంటున్నారు. తాజాగా అక్రమ నిర్బంధం కేసుపై పెదవేగి ఎస్సై న్యాయమూర్తి మెమో జారీ చేశారు. గతంలోనూ భీమడోలు పోలీసుల అత్యుత్సాహంపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారు.

పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ వేధింపులు

జిల్లాలో అధికార పార్టీ వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. రెడ్‌బుక్ పేరుతో దెందులూరు, యలమంచిలి, భీమడోలు ఇలా కొన్ని ప్రధాన పోలీస్‌స్టేషన్లలో పోలీసుల మితిమీరిన అత్యుత్సాహం సమస్యాత్మకంగా మారింది. కేవలం టీడీపీ నేతలు చెప్పారని ఫిర్యాదు లేకుండా రోజులు తరబడి వైఎస్సార్‌సీపీ శ్రేణులను పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి.

తాజాగా గత వారం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సోదరులు చల్లగోళ్ళ తేజ, ప్రదీప్‌లను అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో ముందస్తుగా సమాచారం ఇవ్వడం పోలీసుల ప్రాథమిక విధి. 2024 జనవరిలో జరిగిన ఘర్షణపై అదే సంవత్సరం మేలో కేసు నమోదు చేయడం, ఆ కేసులో 2025 జూలైలో అరెస్టులు చూపడం కేవలం రాజకీయ కక్షతోనే జరిగింది. ఈ క్రమంలో కోర్టులో కూడా తెల్లవారుజాము వరకు వాదనలు జరిగాయి. పాత కేసుల్లో ఇప్పుడు అరెస్టు చేయడంపై జడ్జి ఆగ్రహం వ్యక్తం చేసి పెదవేగి ఎస్సై రామకృష్ణకు మెమో జారీ చేశారు.

యలమంచిలిలో మరీ అత్యుత్సాహం

యలమంచిలిలో ఈ ఏడాది మే 19న జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో పోలీసుల తీవ్ర అత్యుత్సాహం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. అధికార టీడీపీకి ఎలాంటి బలం లేనప్పటికీ మంత్రి నిమ్మల రామానాయుడు డైరెక్షన్‌లో పోలీసులు హడావుడి చేసి ఓటింగ్‌నే అడ్డుకోవాలని ప్రయత్నించారు. అది కూడా కోర్టు ఆదేశాలతో జరుగుతున్న ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం చర్చగా మారింది. ఎంపీటీసీ కంభాల సత్యశ్రీ కనిపించడం లేదని తన కుమార్తె ఫిర్యాదు చేసిందనే సాకుతో ఓటింగ్‌కు వచ్చిన ఆమెను స్టేషన్‌కు తీసుకువెళ్లడానికి బలంగా ప్రయత్నించిన క్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. అయినప్పటికీ ఆమెను పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కేవలం ఎన్నికలు వాయిదా వేయించడానికి ఈ తరహా ఎత్తుగడ రాజకీయంలో మహిళా ప్రజాప్రతినిధిని ఇబ్బంది పెట్టారు.

హైకోర్టు ఉత్తర్వులున్నా బేఖాతరు

ఇదే విధంగా గతంలో నిడమర్రుకు చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త బేతు సతీష్‌పై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి హడావుడిగా అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులోనూ న్యాయమూర్తి ఆదేశాలతో పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. పెదపాడులో పోలీసుల అరాచకం తారాస్థాయిలో ఉంది. ప్రైవేటు వ్యవహారాలు, హైకోర్టు ఉత్తర్వులున్న సివిల్ వ్యవహారాల్లో సైతం తలదూర్చడంతో పాటు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. పెదపాడు మండలం గుడిపాడులో 6 ఎకరాల ప్రైవేటు భూమిలో భూ యజమాని చేపలు, రొయ్యల చెరువులు సాగుచేస్తున్నారు. స్థానిక టీడీపీ నేతలతో భూ యజమానికి రాజకీయంగా విభేదాలున్నాయి. చెరువు యజమాని వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందినవాడు కావడంతో పట్టుబడుల సమయంలో అడ్డగించడం, రహదారులను ధ్వంసం చేసి వాహనం బయటకు వెళ్లనీయకుండా చేయడంతో పాటు ఎస్సై శారదా సతీష్ రమ్మంటున్నారని స్టేషన్‌కు పిలిపించి చేస్తూ తీవ్రంగా వేధింపులకు గురి చేశారు. సదరు చెరువు యజమాని చేపలు పట్టుకోవడానికి తహసీల్దార్, ఎస్సై తగిన ఏర్పాట్లు చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చినా వాటిని అమలు చేయకుండా టీడీపీ నేతల అడుగులకు మడుగులొత్తడం వివాదాస్పదంగా మారింది.


మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాలకొల్లు మండలంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జొన్నల గరువు గ్రామానికి చెందిన కట్టా నవీన్ కుమార్ (19) ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. దీనిపై యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆ యువకుడిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ కుమార్ ఆదివారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి కట్టా శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి సురేంద్ర కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాములపర్రు శివారు రామాపురంలో ఆదివారం ఉదయం వ్యాన్ ఢీకొనడంతో సప్పా సుబ్రహ్మణ్యం (44) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆలయాల్లో ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు కసరత్తు



- వచ్చేనెల మొదటి వారంలోగా కొలిక్కివచ్చే అవకాశం
- సభ్యులుగా స్థానం కోసం ఆశావహుల పైరవీలు

ద్వారకాతిరుమల: దేవాలయాల్లో కొత్త ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు నాటికి లేదా వచ్చే నెల మొదటి వారంలో ఇది ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కూటమి నేతలు ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా స్థానం దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకున్నారు. దీంతో వారు 25 మంది పేర్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఇప్పటికీ కొందరు ఆశావహులు ఇంకా పైరవీలు సాగిస్తూనే ఉన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌తో పాటు మరో 17 మంది సభ్యులతో ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. అందులో 13 పదవులు టీడీపీకి ఇచ్చి, బీజేపీ, జనసేనలకు చెరో రెండు పదవులు ఇచ్చి సరిపెట్టేందుకు యోచిస్తున్నట్టు సమాచారం. తాజాగా ప్రభుత్వం రాష్ట్రంలో వంశపారంపర్య ధర్మకర్తలున్న ఆలయాలకు ట్రస్టు బోర్డుల ఏర్పాటులో మినహాయింపు ఇచ్చేందుకు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే గనుక జరిగితే రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం దేవస్థానాలకు ట్రస్టు బోర్డులు లేనట్టే. ఇక్కడ పదవులు ఆశిస్తున్న నేతలకు చుక్కెదురైనట్టే. ప్రభుత్వం దీనిపై ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

ట్రస్టు బోర్డులున్నా.. సభ్యులు డమ్మీలే

వంశపారంపర్య ధర్మకర్తలు ఉన్న ఆలయాలకు ట్రస్టు బోర్డు సభ్యులు కేవలం డమ్మీలుగా మాత్రమే వ్యవహరిస్తారన్నది జగమెరిగిన సత్యం. బోర్డు సభ్యులంతా కలసి ధర్మకర్తను మార్చడానికి వీలుపడదు. కేవలం వారు ట్రస్టు బోర్డు సభ్యులమని చెప్పుకోవడానికి, ఆ పేరుతో ఉచితంగా తమకు, తమ వారికి దర్శనాలు చేయించుకోవడానికి, ప్రసాదాలు అందుకోవడానికి మాత్రమే ఉపయోగపడతారు. ఇది దేవస్థానానికీ అదనపు భారమే. ప్రభుత్వం ఇవే అంశాలను పరిగణనలోకి తీసుకుని వంశపారంపర్య ధర్మకర్తలున్న ఆలయాలకు ట్రస్టు బోర్డుల ఏర్పాటులో మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

పరదాలు, కాపలా అక్కరలేదంటూనే..

- హోం మంత్రి పర్యటనలో హంగామా
- ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు



హోం మంత్రి పర్యటన సందర్భంగా దారి మళ్లించిన ఆర్టీసీ బస్సులు



హోంమంత్రి అనిత పర్యటనలో రోప్ వాడిన దృశ్యం



వైరు తాడుతో కార్యకర్తల్ని, నాయకుల్ని అడ్డుకుంటున్న దృశ్యం

ఆకివీడు: హోం శాఖమంత్రి వంగలపూడి అనిత సోమవారం ఆకివీడు పర్యటన సందర్భంగా సామాన్యులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డుకోవడం, ఆర్టీసీ బస్సులను దారి మళ్లించడంతో ప్రజానీకానికి ఇబ్బందులు తప్పలేదు. కానీ స్థానిక వెలంపేట రామాలయం వద్ద జరిగిన సభలో హోం మంత్రి వనిత మాట్లాడుతూ తమ పర్యటనలో పరదాలు అక్కరలేదు, చెట్లు కొట్టక్కరలేదు, షాపులు మూయ్యక్కరలేదు, పైన పోలీసులు కాపలా కాయక్కరలేదు అంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై వ్యంగ్యంగా మాట్లాడడం గమనార్హం. తమ ప్రభుత్వంలో బయటకు వస్తే ప్రశాంతంగా బతకవచ్చని హోం మంత్రి అనిత చెబుతున్నా ఆమె పర్యటన కారణంగా ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందులు తప్పలేదు. రోపులు, వైరు తాడులు ఉపయోగించి నాయకులను, స్థానికుల్ని అడ్డుకోవడం కొసమెరుపు. ఉదయం 10 గంటలకు వస్తారని పోలీసులు హడావిడి చేసినా మధ్యాహ్నం 12.30 గంటలకు ఆమె రావడంతో సభా వేదిక వద్ద ఉన్న డ్వాక్రా మహిళలు నీరసించి, విసుగుచెందారు.

గృహ నిర్బంధాలు దారుణం



ఆచంట వేమవరంలో పుష్పరాజ్ హౌస్ అరెస్ట్

పెనుగొండ: పేదలపై జరిగిన దాడులను ఎదరించి నిలబడితే, గృహ నిర్బంధాలు చేయడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఉండి నియోజకవర్గం ఆకివీడు మండలం ధర్మపురి అగ్రహారం దళితుల ఇళ్ల కూల్చివేత తగదంటూ పోరాటం చేయడానికి వెళుతుంటే ఆచంట వేమవరంలో పుష్పరాజును గృహ నిర్బంధం చేశారు. దీనిపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. హోం మంత్రి అనిత పర్యటన సందర్భంగా తనను హౌస్ అరెస్ట్ చేసినట్లు పుష్పరాజ్ తెలిపారు. ఉద్యమాలను అణచి వేయలేరన్నారు. పేదల ఇళ్లు తొలగించడం దారుణమని, వారికి పక్కా స్థలాలు చూపించి, ఇళ్ల నిర్మాణం చేపట్టే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సంగీత దర్శకుడు గణేష్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డు పొందిన గణేష్‌చారి

దెందులూరు: తిరుపతిలో జరిగిన జాతీయ స్థాయి నాటక పోటీల్లో దెందులూరుకు చెందిన సాయి గణేష్ చారికి ఉత్తమ సంగీత దర్శకుడిగా హనుమాన్ అవార్డు లభించింది. అభినయ ఆరుట్స్ ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఈ పోటీలు నిర్వహించింది. పోటీల్లో హేలపురి కల్చర్ల అసోసియేషన్ ప్రదర్శించిన సారీ రాంగ్ నెంబర్ అనే సాంఘిక నాటికకు సాయి గణేష్ చారి సంగీతం అందించి ఉత్తమ సంగీత దర్శకుడిగా హనుమాన్ అవార్డును కైవసం చేసుకున్నారు. అభినయ ఆరుట్స్ కార్యదర్శి బి.ఎస్.రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు అవార్డులు అందజేశారు.

రోడ్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో చాలా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సోమవారం సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్రాంతికి గోతులు లేని రోడ్లు నిర్మిస్తామని, తరువాత పూర్తిస్థాయిలో రోడ్లు వేస్తామని చెప్పిందని, కానీ నేటికీ చాలా రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఆయన విమర్శించారు. రోడ్ల నిర్మాణం ఎమ్మెల్యేల బాధ్యతని, దానికి వారే జవాబుదారీ అని చెప్పిన ముఖ్యమంత్రి నేడు ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో పట్టించుకోకపోతే ప్రజలు ఎవరిని అడగాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



అత్తిలి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తహసీల్దార్ దశిక వంశీ

అత్తిలి: స్థానిక గాంధీనగర్‌లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక గృహం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బండారు లక్ష్మికి చెందిన పెంకుటిల్లు కాలిపోగా ఇంట్లో వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రమాద వివరాలు తెలిసిన వెంటనే తహసీల్దార్ దశిక వంశీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయంగా ఆయిల్ ప్యాకెట్లు, బియ్యం, కూరగాయలు అందజేశారు. ఈ ప్రమాదంలో రూ.40 వేలు నగదు కాలిపోగా, 2 లక్షల 50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణం, గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణంలలో నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ఇప్పటికే 114 మంది పాత నేరస్థులపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు తెలిపారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో సోమవారం మునిసిపల్ సంఘ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 వినతులు అందాయి. టౌన్ ప్లానింగ్‌కు 1, ఇంజనీరింగ్‌కు 3 సమస్యలు ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వై.వి.రమణ, అసిస్టెంట్ కమీషనర్ డి.రవి కుమార్, ఏసీపీ జి.సీతారాం, మేనేజర్ యు.రవి సుధాకర్, డాక్టర్ ఎస్‌రాజు, టీపీఓ, రెవిన్యూ ఆఫీసర్, సానిటరీ ఇనస్పెక్టర్లు, మెప్మా సీఎంఎం, ఆయా డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడవద్దు

భీమవరం: రైతులు వరిసాగులో అవసరానికి మించి ఎరువులు వినియోగించవద్దని, ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మత్స్య, మార్క్‌ఫెడ్ అధికారులతో ఎరువుల లభ్యత, వినియోగంపై సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా మంచి దిగుబడుతు సాధించడమేగాక తక్కువ పెట్టుబడితో పాటు భూమికి సారం లభిస్తాయన్నారు. జిల్లాలో గురప్పు డెక్క ద్వారా వర్మి కంపోస్ట్ తయారిని చేపట్టామని, అధిక పోషక విలువలున్న గురప్రు డెక్క కంపోస్ట్‌ను అవసరమైన రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి నాగలింగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలో గగ్గోలు

- తాము మోసపోయామంటూ రోదనలు
- ఒక్క సంక్షేమం పథకం రాలేదంటూ ఆగ్రహం
- పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నామని ఆందోళన
- గతంలో విద్య, వైద్యంతోపాటు మహిళలకు పెద్దపీట వేశారని కితాబులు
- జగన్ ఉన్నప్పుడే బాగున్నామంటున్న మహిళలు



తణుకులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో యువకుడితో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి



ఏలేటిపాడులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కరపత్రాలు అందిస్తున్న ఇరగవరం మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్

తణుకు అర్బన్: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ప్రతి గడప గొల్లుమంటున్న వైనం చవిచూడాల్సి వస్తుంది. ఇంటి గుమ్మంలోకి వెళ్లగానే బాబూ జగన్ ఉన్నప్పుడే బాగుండేదని ఈ కూటమి ప్రభుత్వం ఏ పథకం ఇవ్వకుండా మమ్మల్ని మోసం చేశారంటూ చెబుతుండడం విశేషం. కరెంటు బిల్లులు పెంచేశారని, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని, పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నామని విద్యాదీవెన, వసతి దీవెనలతో ఇంజనీరింగ్ చదువులు రూపాయి కట్టాల్సిన అవసరం లేకుండా గడిచిపోయాయని నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఫీజులు చెల్లించాల్సి వస్తుందంటూ ప్రజలు గొల్లుమంటున్నారు. సంపాదన తినడానికే సరిపోవడం లేదని, పెరిగిన కరెంటు బిల్లులు ఎలా చెల్లించాలంటూ ఆవేదన చెందుతున్నారు. ఏ మహిళను కదిలించినా గతమెంతో బాగుందని, ఓట్లతో గెలిచారో, మెషిన్‌లతో గెలిచారో కానీ మా బతుకులు బుగ్గి అయ్యాయంటూ రోదిస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో..

తణుకు నియోజకవర్గంలోని పట్టణంతోపాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం దూసుకుపోతోంది. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాలతో పార్టీ శ్రేణులు గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తున్నారు. ప్రజలు సైతం చంద్రబాబును నమ్మి మోసపోయామని ప్రజానీకం నేరుగా చెబుతున్నారని అంటున్నారు. ఇప్పటికే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం తణుకు నియోజకవర్గంలో ప్రజల్ని ఆలోచింపచేసే విధంగా ముందుకెళ్తోంది.

ప్రజలు ఛీకొడుతున్నారు..



కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు ఛీకొడుతున్నారు. ఏ గుమ్మంలోకి వెళ్లినా మహిళలు మేము మోసపోయామని ఉచిత బస్సు, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి వంటి పథకాలకు మోసపోయామని ముక్తకంఠంతో చెబుతున్నారు. కరెంటు బిల్లులంటే ప్రజలు భయపడి పోతుండగా, ముఖ్యంగా రేషన్ డిపోలకు వెళ్లి బియ్యం తెచ్చుకోవడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాలిచ్చే ఆవును దూరం చేసుకున్నామని మాకు ఈ శాస్తి జరగాల్సిందేనంటూ మండిపడుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారం ఆ పార్టీ, ఈ పార్టీ, కులం, మతం చూడకుండా అర్హులందరికీ ఇచ్చారని కానీ నేడు టీడీపీలో సభ్యత్వం ఉంటేనే పథకాలు ఇస్తామనే ధోరణిలో నాయకులు ఉన్నారు. జగన్ పుణ్యమా అని సొంతిళ్లు ఏర్పరచుకున్నామని ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని మహిళలు చెబుతున్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం తణుకు నియోజకవర్గంలో ప్రజలు ఆదరిస్తున్నారు. ఏం చేశారని సుపరిపాలన తొలి అడుగు అంటూ ప్రజల్లోకి వెళ్తున్నారో ఆ ప్రజలకు అర్థమైంది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

ఏ పథకమూ రావడంలేదు



కరెంటు బిల్లులు కట్టలేకపోతున్నాం. గ్యాస్ సిలిండరు ఇప్పటివరకు ఒక్కటి మాత్రమే వచ్చింది. గతంలో ఏ పథకమైనా చెప్పిన వెంటనే వచ్చేవి కానీ నేడు ఏ పథకం కూడా రావడవంలేదు. రేషన్ బియ్యం గతంలో ఇంటివద్దకు రాగా నేడు డిపోకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది.

– మాధవి, తణుకు

జగన్ సొంతిళ్లు ఇచ్చారు



జగన్ ప్రభుత్వమే బాగా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని పథకాలు అందజేశారు. 30ఏళ్ల మా ఎదురుచూపులకు భగవంతుడు జగన్ రూపంలో మాకు సొంతిళ్లు నిర్మించుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఆయనకు మేము చాలా రుణపడి ఉంటాము. ఈ ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తయినా ఇంతవరకు ఏ ఒక్క పథకం కూడా ఇవ్వలేదు.

– షకీలా బేగం, తణుకు

నకిలీ, అక్రమ మద్యం విక్రయిస్తే కఠినచర్యలు



పైడిపర్రులోని కర్మాగారంలో మిథైల్ ఆల్కహాల్ శాతాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: నకిలీ, అక్రమ మద్యం విక్రయాలు నిర్వహిస్తే కఠినచర్యలు ఉంటాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి హెచ్చరించారు. సోమవారం తణుకులో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో నకిలీ మద్యం రాకెట్లు తెలుగు రాష్ట్రాల్లో బయటపడిన నేపథ్యంలో తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నకిలీ మద్యం, సుంకం చెల్లించని మద్యం నివారణకు అన్ని రకాలుగా కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నకిలీ, అక్రమ మద్యం రవాణాకు అవకాశం ఉండే సున్నితమైన మార్గాలను గుర్తించి నిరంతరం కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేశామని, అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలో ఉన్న రెక్టిఫైడ్ స్పిరిట్, మిథనాల్ యూనిట్‌లను నిరంతరం తనిఖీ చేయడంతో పాటు ఆ యూనిట్లలో పనిచేసే సిబ్బందికి, యాజమాన్యానికి వారి యొక్క యూనిట్లలో ఉపయోగించే ఇండస్ట్రియల్ ఆల్కహాల్ దుర్వినియోగం కాకుండా తీసుకోవలసిన చర్యలను సూచిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల రెండుసార్లు వరుసగా అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి మీద రెండు కేసులు నమోదు చేయడంతో పాటు అతని నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామని, లక్ష రూపాయలు జరిమానా విధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బూటకపు హామీలతో నయవంచన



ఏలేటిపాడు గ్రామంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: కూటమి పాలనలో ప్రజలకు మోసాలే మిగిలాయి తప్ప, ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని ఏలేటిపాడు గ్రామంలో సోమవారం బాబుష్యూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి నాయకులు బూటకపు హామీలతో ప్రజలను మోసగించారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, ఆడ బిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, 50ఏళ్లకే ఫించన్ వంటి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చే హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బూత్ కన్వీనర్ కొవ్వూరు శ్రీనివాస్‌రెడ్డి, చోడే ఏసురత్నం, బొంత సురేష్, కొవ్వూరు దుర్గా రెడ్డి, వెలగల ప్రసాద్ రెడ్డి, పిల్లి శ్రీను, నల్లమిల్లి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి



తణుకులో రక్తదానం శిబిరంలో పండ్లు అందజేస్తున్న డాక్టర్ హరిబాబు

తణుకు అర్బన్: ఒత్తిడితో కూడిన నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని ముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ (హరిబాబు) అన్నారు. పారిశ్రామికవేత్త ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ 105వ జయంతి సందర్భంగా తణుకు శ్రీముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన శిబిరంలో 650 మంది రోగులు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రాజగోపాల్, హాస్పిటల్ సీఏవో కోటమ్‌రెడ్డి వీరబాబు, వైద్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



దండగర్ర నెం.158 అంగన్‌వాడీ కేంద్రం రికార్డులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర నెం.154, 157, 158 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడేళ్ల పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. తద్వారా పూర్వ ప్రాథమిక విద్య అలవడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న విద్య, పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులకు వివరించి, చిన్నారుల సంఖ్యను పెంచాల న్నారు. గర్భిణు లు, బాలింతల కు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు ఉన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు 300 మొక్కల పంపిణీ, ఆలయానికి వీల్ చైర్ బహూకరణ, అంజలి మానసిక పాఠశాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత, పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ, బ్లడ్ బ్యాంకులో రక్తదానం వంటి కార్యక్రమాలు చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, ప్రస్తుత జిల్లా గవర్నర్ ఎస్ పాపారావునాయుడు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



పెంటపాడులో తహసీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పటిష్ట పరిచి ఆయా సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. రాష్ట భవన నిర్మాణ కార్మిక రంగం ఇచ్చిన పిలుపులో భాగంగా ఏరియా తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం తహసీలాద్ర్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి ఏడాది దాటినా భవన నిర్మాణ రంగ కార్మిక సమస్యలు అజెండాలోకి రాకపోవడం విచారకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్‌బోర్డుకు తగు యంత్రాంగం ఏర్పాటు చేసి, బోర్డుకు పాలక మండలిని నియమించి, కార్మిక సంఘాల ప్రతినిధులకు బోర్డులో స్థానం కల్పించాలని, బోర్డులో నూతన కార్మికుల నమోదు కోసం గ్రామ, వార్డు సచివాయాల్లో అవకాశం కల్పించాలని, వృద్ధాప్యం కారణంగా పని నుంచి విరమించుకున్న కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట వ్యాప్తంగా ఆయా సమస్యలు పరిష్కారం కాకపోతే అన్ని సంఘాలు ద్వారా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, అత్తిలి బాబి, బోడపాటి నాగేశ్వరరావు, దువ్వా శ్రీనివాస్, అంకం భాస్కర్ రావు, మెండెం జేమ్స్, పట్టణ, మండల కార్మిక నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు ప్రారంభించాలి

పెంటపాడు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పునఃప్రారంభించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పెంటపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు సత్యానారాయణ, పిళ్లం గోళ్ల కృష్ణ, తోట సత్యనారాయణ, పెరికల శివరామ కృష్ణ, ఐతం వెంకన్నబాబు, కొండ పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



భీమరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంటి పరీక్షలు చేస్తున్నదృశ్యం

భీమవరం: యువత కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని భీమవరం పట్టణానికి చెందిన నేత్ర వైద్యుడు డాక్టర్ యువి రమణరాజు అన్నారు. స్థానిక ఆర్‌ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నయనేంద్రియం యొక్క సంరక్షణ ప్రాధాన్యత కలిగిన ముఖ్యాంశామని విద్యార్థులు స్పష్టమైన చూపుతో అధ్యయనం చేసి బంగారు భవిష్యత్తు స్వంతం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వికేజె ప్రసూన మాట్లాడుతూ ఎంతో మంది అంధ విద్యార్థులను చదివిస్తూ డాక్టర్ రమణరాజు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ అరవిందస్వామి, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ కాకుమాని శ్రీనివాసరావు, డివివిసిహెచ్ సత్యనారాయణ, జిప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన గురుగుబిల్లి పెంటయ్య అనే వృద్ధుడు అదే గ్రామంలో ఓ గాజులు అమ్మే దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రోడ్డు దాటుతుండగా ఉండి నుంచి భీమవరం వైపుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అతనిని ఢీకొట్టాడు. దీంతో గాయాల పాలైన అతనిని కుటుంబ సభ్యులు భీమవరంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వృద్ధుడి ఫిర్యాదుపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తణుకులో కృష్ణ యజుర్వేద పారాయణం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న కామేష్ తదితరులు

తణుకు అర్బన్: శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి 33వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం తణుకులో 7 రోజులపాటు కృష్ణయజుర్వేద పారాయణం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ న్యాయవాది, రాష్ట బ్రాహ్మణ సంఘ యువజన అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. తణుకు సూర్యాలయం ఎదురుగా ఉన్న హాల్‌లో సోమవారం పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ పారాయణ కార్యక్రమంలో భక్తులంతా ఆహ్వానితులేనని చెప్పారు. వేద పండితులు గుళ్లపల్లి శివశర్మ శ్రేతి మాట్లాడుతూ ఇరగవరానికి చెందిన వేద పండితులచే నిర్వహించే ఈ కృష్ణ యజుర్వేద పారాయణం నిర్వహణతో తణుకు పట్టణం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గమిని రాజా, గుళ్లపల్లి అమర్‌శర్మ, న్యాయవాది టి.సురేష్, పచ్చిపులుసు శంకర్, భమిడి రామావధానులు, భమిడి సూర్యనారాయణ, టి.సిద్దూ, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



స్మార్ట్ మీటర్లు బిగింపు ఆపాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎనిమిదో రోజు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. శేషమహల్ ఏరియా, మసీద్ రోడ్డు, వీకర్స్‌కాలనీలలో ప్రచారాలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు తీరును ఖండించారు. రాష్ట ప్రజలు బాబుకు నమ్మి అధికారం ఇస్తే బాబు ష్యూరిటీ లేదు, భవిష్యత్తు మోసం అనే అంచనాకి రాష్ట్ర ప్రజలు వచ్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, కన్నంరెడ్డి శివాజీ, తోట శ్రీను, నాగిరెడ్డి సాయి, యడ్ల శ్రీను, పకుర్తి చిన అప్పారావు, కమ్మిరెడ్డి ఉదయ్ కుమార్, విశంశెట్టి అప్పారావు, పతివాడ నాగేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాటర్ అమ్మకంపై ఫిర్యాదు

నరసాపురం: కుళాయిల ద్వారా మున్సిపాలిటీ సరఫరా చేసే మంచినీటిని అక్రమంగా తన ప్రైవేట్ ట్యాంకర్లలో పట్టి విక్రయిస్తోన్న నరసాపురం 30వ వార్డు జవదాలపేటకు చెందిన బండారు సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని స్థానిక వార్డు కౌన్సిలర్ అడిదల శరత్ ఫిర్యాదు చేశారు. సోమవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. స్థానికులు ఈ అక్రమ దందాను ఆపి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, అయితే అధికారులు అతనిపై చర్యలు తీసుకోకపోగా, ట్యాంకర్‌ను కూడా వదిలేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేయిస్తానని ఆర్డీఓ హామీ ఇచ్చినట్టు శరత్ చెప్పారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 47 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.